క్లుప్తంగా

నిధులు మంజూరు చేయాలని మంత్రికి వినతి


మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : పట్టణంలోని అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.50కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవీంద్రకుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టిన మిషన్ భగీరథ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనుల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణానికి గాను నిధులు మంజూరు చేయాలని ఆయన మంత్రి కేటీర్‌కు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట పల్లా ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వం 58,59 జీఓ కింద ఇళ్ల రెగ్యులరైజ్ చేసుకునేందుకు అవకాశం కల్పించినందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర కోటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాపూజీనగర్‌లో వార్డు ప్రజలకు ఇంటి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధికార ప్రతినిధి పిన్న బోయిన శ్రీనివాస్ యాదవ్, మోహన్‌రావు, శ్రీకాంతాచారి, కొండల్ గౌడ్, దుర్గాచారి, రామారావు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిదానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని ఆయన పేర్కొన్నారు.రక్తదానం చేయాలనుకునే వారు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొండమల్లేపల్లి : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక బీఆర్ఎస్ నాయకులు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పస్నూరి యుగంధర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు కేసాని లింగారెడ్డి, సర్పంచ్ గడ్డం శ్రీరాములు , ఎంపీటీసీ సుమలత భాస్కర్, పాండునాయక్, రావుల సత్యనారాయణ, రావుల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గుర్రంపోడు : మండలంలోని వట్టికోడు గ్రామ సర్పంచ్ కేసాని యాదగిరిరెడ్డి ఇటీవల గుర్రంపోడు నుంచి నల్లగొండకు వెళ్తూ సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసుశాఖ నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా మొబైల్‌ను ఎస్ఐ శివప్రసాద్, రైటర్ చిన బాబులు ట్రాక్ చే సి శుక్రవారం బాధితుడికి మొబైల్ అందజేశారు.

సీపీఆర్‌పై అవగాహన

అడవిదేవులపల్లి : గుండెపోటుతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అందించే సీపీఆర్‌పై అడవిదేవులపల్లి మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మసూద్ షరీఫ్, డాక్టర్ ఉపేందర్‌లతో పాటు పలువురు వైద్య సిబ్బంది. ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

మాడుగులపల్లి: విద్యుదాఘాతంతో మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో మూడు గేదెలు మృతిచెందాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అల్లం లక్ష్మమ్మ ఉదయం రెడ్డీస్ ల్యాబొరేటరీ సమీపంలో గేదెలను మేపేందుకు వెళ్లింది.రాత్రి ఈదురుగాలుల కారణంగా ఎల్‌టీ లైన్ తెగిపడింది. బర్రెలు మేస్తూ తీగను తాకడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్షా యాభై వేలు నష్టపోయినట్లు బాధిత కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని సరఫరా నిలిపేశారు. బీమా వచ్చేలా చూసి ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

డీఎస్పీ బహిరంగ సభను జయప్రదం చేయాలి

హాలియా : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 30న నిర్వహించనున్న దళితశక్తి ప్రోగ్రాం (డీఎస్‌పీ) భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ నాయకులు మామిడి రవి మహారాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆ సంఘం నేతలతో కలిసి ఆయన బహిరంగ సభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల నాయకులు శివ మహారాజ్, గోవర్ధన్ మహారాజ్, మహారాజ్, మహేష్ ఉన్నారు.

ఏకగ్రీవాలకు నజరానా ఏదీ?

- సర్పంచ్‌ల పదవీకాలం దగ్గర పడుతున్నా అందని ప్రత్యేక నిధులు
- ఊసే ఎత్తని ప్రభుత్వం
- తిరుమలగిరి మండలంలో 11 గ్రామపంచాయతీలు ఏకగ్రీవం



తిరుమలగిరి(నాగార్జునసాగర్) : గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకుంటే ఆయా గ్రామపంచాయతీలకు రూ.10 నుంచి 15లక్షలు నజరానా అంటూ ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు జరిగి, ఆయా ప్రజాప్రతినిధుల పదవీకాలం కూడా పూర్తికావొస్తున్నా అందాల్సిన కానుక మాత్రం నేటికి అందకపోవడంతో సర్పంచ్‌లకు నిరాశే మిగిలింది. ఎన్నికల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా మీ గ్రామాల్లో సర్పంచ్‌లను ఎన్నుకున్నట్లయితే పెద్ద గ్రామపంచాయతీలకు రూ.15లక్షలు, చిన్న గ్రామపంచాయతీలకు రూ.10లక్షలు ప్రత్యేకంగా నిధులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో తిరులమగిరి మండలంలోని 34గ్రామపంచాయితీలకు గాను సుంకిశాలతండా, ఎర్రచెరువుతండా, సీతల్‌తండా, గట్టుమీదితండా, రంగుండ్ల, తూటిపేటతండా, కిష్యతండా, తెట్టకుంట, సఫావత్ తండా, గోడుమడక, జువ్విచెట్టుతండా 11గ్రామపంచాయతీల్లో ఎన్నికలు లేకుండా సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే సర్పంచ్‌ల పదవీ కాలానికి ఇంకా ఎనిమిది నెలలు మాత్రమే గడువు ఉండటంతో నేటి వరకు నజరాన రాలేదని, ప్రత్యేక నిధులు వచ్చుంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకొనే వారమని వాపోతున్నారు. ఈ నజరాన వస్తదనే ఆశతోనే నాడు పోటీల్లో ఉన్న అభ్యర్థులను సైతం బ్రతివిలాడి పది రూపాయలు ఎక్కువగా చెల్లించి మరి ఏకగ్రీవం చేసుకుంటే నేడు ప్రభుత్వం మాకు మొండి చేయి చూపించడం దారుణమని వాపోతున్నారు.

పెద్ద పంచాయతీలకు రూ.15లక్షలు

సాధారణంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయితీలకు రూ. 10లక్షల నజరానిచ్చే ప్రక్రియను గత ప్రభుత్వాలు కొనసాగించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రూ. 5లక్షలు ఎమ్మెల్యే నిధులను అదనంగా చేర్చి మొత్తం రూ. 15లక్షలు కానుకగా ఇస్తామని ప్రకటించింది. అందులో పెద్ద గ్రామపంచాయతీలకు రూ. 15లక్షలు, చిన్న గ్రామపంచాయితీలకు 10లక్షలు ఇస్తామని గ్రామపంచాయితీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. కానీ నేటికి కార్యరూపం దాల్చలేకపోయింది.

ముగియనున్న పదవీకాలం

2019 జనవరి 25న గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఫిబ్రవరి 2న సర్పంచ్‌లు ప్రమాణస్వీకారం చేశారు. ప్రస్తుతం సర్పంచులుగా కొనసాగుతున్న వారి పదవీ కాలం ఇంకా ఎనిమిది నెలలు మాత్రమే ఉంది. ఏది ఏమైన గ్రామపంచాయతీల అభివృద్ధికి నిధులు అందించాల్సిన ప్రభుత్వం ప్రత్యేక కానుక మరచిపోవడంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆవేదన చెందుతున్నారు.

ప్రత్యేక నిధులు ఇవ్వాలి



ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రత్యేక నిధులు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతోనే మా గ్రామస్తులంతా గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నారు. ప్రభుత్వం ప్రత్యేక నజరాన ఇచ్చినట్లయితే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంటుంది.

- కేతావత్ జ్యోతి, సర్పంచ్, సుంకిశాలతండా

పదవీ కాలం ముగియనుంది



మేము సర్పంచ్‌లుగా గెలిచి నాలుగేళ్లు దాటి మా పదవీ కాలం ముగియడానికి ఇంకా నెలలు మాత్రమే ఉంది. కానీ నేటికి ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక నజరాన కార్యరూపం దాల్చలేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యేక నిధులను విడుదల చేయాలి.

- రాంసింగ్ నాయక్, సర్పంచ్ తూటిపేటతండా

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి


మోడల్ ఎంసెట్ ప్రశ్న పత్రాలను విడుదల చేస్తున్న జూలకంటి

మిర్యాలగూడ అర్బన్ : విద్యార్థులు ఇష్టపడి చదివితే ర్యాంకులు మంచి ర్యాంకు సాధించవచ్చాని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్ పశ్నపత్రాలను స్థానిక కేఎల్ఎన్ కళాశాలలో విడుదల చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. పోటీ పరీక్షలకు విద్యార్థులు అనేక వ్యయప్రయాసాలతో సిద్ధమవతుంటే ప్రశ్నపత్రాలను లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమడుతున్నారని విమర్శించారు. పోటీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్షలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, కెఎల్ఎన్ కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మూడావత్ రవినాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు సురేష్, ఖమ్మంపాటి శంకర్, నాయకులు కుర్ర సైదానాయక్, వదూద్, జగన్, సమ్మద్, ఆకాష్, ఉపేందర్, రవి, సాయి, అఖిల పాల్గొన్నారు.

తాటికోల్ సర్పంచ్‌కు మహిళా ఎక్సలెన్స్ అవార్డు

దేవరకొండ : శ్రీ రామానుజ సహస్రాబ్ది జయంతి వేడుకల్లో భాగంగా మహిళా ఎక్సలెన్స్ అవార్డును శుక్రవారం దేవరకొండ మండలంలోని తాటికోల్ గ్రామ సర్పంచ్ జూలూరి ధనలక్ష్మి అందుకుంది. ఈ అవార్డును శ్రీ రామనుజన్ చిన్న జీయర్ స్వామి అందజేశారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని రామానుజ ఆశ్రమంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు ఆమె అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జూలూరి ధనలక్ష్మి మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డును ప్రదానం చేయడంపై ఆమె సంతోషం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే


పత్రాలను అందజేస్తున్న సీడీపీఓ, సూపర్‌వైజర్

నాగార్జునసాగర్ : అనుముల ప్రాజెక్టు పరిధిలోని హిల్‌కాలనీ మూడో అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం వినూత్నంగా ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. సీడీపీఓ ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారుల తెలివితేటలను పరీక్షించి ఫస్ట్ క్లాస్లులో చేరేందుకు పట్టాలను పంపిణీ చేశారు.

చిన్నారి కుటుంబానికి అండగా ‘వన్ చాలెంజ్’


ఆర్థిక సాయం అందజేసి పరామర్శిస్తున్న పటాన్‌చెరువు సీఐ వేణుగోపాల్‌రెడ్డి

నిడమనూరు : పటాన్ చెర్వు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి వన్ చాలెంజ్ సంస్థ మరో చిన్నారి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచింది. త్రిపురారం మండలం కోమటిగూడెంకు చెందిన అలంపల్లి శంకర్ హాలియాలో నివాసం ఉంటున్నాడు. శంకర్‌కు ఏడాది వయసున్న కుమారుడు గణేశ్‌కు ఇటీవల నిమ్స్(హైదరాబాద్)లో గుండెకు ఆపరేషన్ చేశారు. చాలా చోట్ల తిరిగి వ్యయ ప్రయాసలకు లోనైన శంకర్ ఆర్థిక పరిస్థితి బాగో లేదని తెలుసుకుని చికిత్స అనంతర ఖర్చుల కోసం రూ.50వేలను సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డి ‘వన్ చాలెంజ్’ తరఫున శంకర్‌కు అందజేశారు. తన పరిస్థితి తెలుసుకుని వచ్చి ఆర్థిక సాయం చేసిన పటాన్ చెరువు సీఐ నూకల వేణుగోపాల్‌రెడ్డికి శంకర్‌తో పాటు కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ముకుందాపురాకు చెందిన సయ్యద్ జాన్ ఉన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని పంచాయతీ కార్యదర్శుల సమ్మె


హాలియాలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు


పెద్దఅడిశర్లపల్లిలో నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు


తిరుమలగిరి : సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

హాలియా : ప్రొబేషనరీ కాలం ముగిసినప్పటికీ ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజ్ చేయలేదని వెంటనే రెగ్యూలరైజ్ చేస్తూ జీఓ విడుదల చేయాలని అనుముల మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శాంతియుత నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెరుమాళ్ల వెంకన్న, రియాజ్, లక్ష్మీనారాయణ, గోవర్ధన్, సుహాసిని, సునిత, మల్లీశ్వరీ, గిరి, రాము, సైదులు, మధు, జాన్, శ్రీనివాస్, సంతోష్, వెంకన్న తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడ : జేపీఎస్, ఓపీఎస్‌లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో తమ హక్కుల సాధన కోసం జేపీఎస్, ఓపీఎస్‌లు చేపడుతున్న నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లింగానాయక్, నరేష్, ఉపాధ్యక్షుడు రమేష్, సాయికుమార్, రామకృష్ణ, మహేష్, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రోబేషన్ కాలం పూర్తి అయినందున తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ శుక్రవారం దేవరకొండ మండల పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సంధ్య, విజయ్, స్వామి, అనిల్, హరిత, రాజేశ్వరి, రమేష్, శ్రీను పాల్గొన్నారు.

మాడుగులపల్లి : నాలుగేళ్ల సర్వీస్ నిండిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని సంఘం మండలాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట శుక్రవారం జూనియర్ పం చాయతీ కార్యదర్శులు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో ఆసిఫ్, కావ్య, కార్తీక్, పాల్గొన్నా రు.

పెద్దఅడిశర్లపల్లి : పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నిరవదిక సమ్మె చేశారు.ఈ సందర్భంగా వారు మాటాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నవీన్, వినోద్, మహేందర్ పాల్గొన్నారు.

డిండి : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరవదిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వేణు, హరి, వెంకటేష్, సూర్య రాజు, రమేష్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శుల(జేపీఎస్) సర్వీస్ రెగ్యులర్ చేయాలని, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను(ఓపీఎస్)లను జేపీఎస్‌లుగా గుర్తించి పంచాయితీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు సమ్మె నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శులు సైదానాయక్, రామకృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి


మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

చందంపేట : ఉమ్మడి చందంపేట మండలంలో రైతులకు పోడు పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లోని వివిధ గ్రామల్లో ఇంటింటికి సీపీఐ ప్రచార యాత్రలో భాగంగా శుక్రవారం పెద్దమూల, కాట్రావత్‌తండా, గాగిళ్లాపురం, గన్నెర్లపల్లి, ధర్మతండా, తిమ్మాపురం గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధికంగా గిరిజన జనాభా కలిగిన ఉమ్మడి చందంపేట మండలంలో పోడు భూముల పైనే ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని, దీంతో అటవీ శాఖ అధికారులు వారిని పొలాల వద్దకు రానివ్వడం లేదన్నారు. కార్యక్రమంలో అంజయ్య నాయక్, దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, మైనొద్దీన్, వెంకటయ్య, అచ్చయ్య, పాండురంగారెడ్డి, వెంగలయ్య, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : ఐసీడీఎస్ దుర్గాబాయి మహిళా శిశు వికాసం కేంద్రం నల్లగొండ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వివిధ కోర్సులపై ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత అన్నారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 14 నుంచి 18 ఏళ్ల వయస్సు గల కిశోర బాలికలకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్స్‌లపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. టైలరింగ్ కోర్సుకు 25 మందికి 45 రోజులు, బ్యూటీషియన్ కోర్స్‌కు 25 మందికి 30 రోజుల వ్యవధిలోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల కిశోర బాలికలు మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. శిక్షణ తేదీలను కూడా తెలియజేస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యే వారు బాలికల అర్హత, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుల జీరాక్స్‌లతో పాటు నాలుగు పాస్‌ఫొటో సైజ్ సమర్పించాలన్నారు. ఈ అవకాశాన్ని కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రభుత్వానికి రైతుల ఉసురు తగలడం ఖాయం


మిర్యాలగూడ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఎల్ఆర్, తదితరులు

మిర్యాలగూడ : దాదాపు నెల రోజుల నుంచి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుల ఉసురు రాష్ట్ర ప్రభుత్వానికి తగలడం ఖాయమని మిర్యాలగూడ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్ఆర్ అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రం శివారులోగల ఐకేపీ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కనీస సౌకర్యాలు లేవన్నారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు బీఎల్ఆర్ ఫోన్ చేసి ఐకేపీ కేంద్రాల్లో ఉన్న సమస్యలను వివరించారు. కనీసం గోనె సంచులు కూడా లేవని, లారీలు రావట్లేదని, వాతావరణ మార్పులతో అకాల వర్షం కురిస్తే రైతుల పరిస్థితి దయనీయంగా మారే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బంటు కిరణ్, అంజిరెడ్డి, నాగునాయక్, రవినాయక్, నాయకులు సిద్ధునాయక్, మోహన్‌రెడ్డి, నాగునాయక్, మోహన్‌నాయక్, శ్రీనునాయక్, మమతా, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

మాడుగులపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని కిసాన్ కాంగ్రెస్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జెడ్పీటీసీ పుల్లెంల సైదులుతో కలిసి పరిశీలించి ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు భోజన వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కాంటాలను త్వరగా పూర్తి చేసి మిల్లులకు తరలించాలని, రవాణాకు ఇబ్బంది లేకుండా లారీలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాధ మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ వేములపల్లి మండలాధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, సర్పంచ్ చింతకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి


రైతులతో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

పెద్దవూర : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోవడంతో నేడు రైతులతో భారీ ఎత్తున రాస్తారోకో చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జిల్లా యువ మోర్చ అధ్యక్షుడు ఐత రాజు సిద్దు, నాయకులు పాలకూర రవి, నర్సింహా, శంకర్, పాండు నాయక్, నాగయ్య, దేవు సింగ్, పద్మ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన


మిర్యాలగూడ అర్బన్ : వీఓఏల సమ్మెకు మద్దతు తెలుపుతున్న పలు సంఘాల నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారం కోసం వీఓఏలు చేస్తున్న న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో వీఓఏలు చేస్తున్న దీక్షలు శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలకు మద్దతు తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం డివిజన్ కార్యదర్శి చేగొండి మురళియాదవ్, లక్ష్మీ, శ్రీకాంత్, చంద్రకళ, రాంబాబు పాల్గొన్నారు.

త్రిపురారం : గ్రామాల్లో ప్రజలకు చేదోడు వాదోడుగా పని చేస్తున్న వీఓఏలను తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులగా గుర్తించాలని నాగార్జున సాగర్ నియోజక వర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు మండల కేంద్రంలో స్త్రీ నిధి కార్యాలయం ముందు వీఓఏలు చేస్తున్న నిరసన కార్యక్రమం శుక్రవారం 12వ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సైదులు, పుష్పలత, స్వామి, అనిత, నాగమణి, పాల్గొన్నారు.

చింతపల్లి : మండల కేంద్రంలో వీఓఏలు చేస్తున్న సమ్మెకు బీజేపీ మండల నాయకులు శుక్రవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమలో రమేశ్‌యాదవ్, అనీల్‌రెడ్డి, మహేశ్, శ్రీనివాస్, సత్యం, వీరేందర్ పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి


అడవిదేవులపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారరభిస్తున్న ఎంపీపీ

చందంపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ చందులాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కాట్రావత్‌తండా, ముదుదండ్ల గ్రామాల్లో కంటి వెలుగు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 230మందికి కంటి పరీక్షలు నిర్వహించి 145మందికి కంటి అద్దాలు అందజేయనున్నట్లు తెలిపారు.

అడవిదేవులపల్లి : మండలంలోని ఉల్సాయిపాలెంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుర్ర సేవానాయక్, ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, స్థానిక సర్పంచ్ రమావత్ ప్రియాంక, ఎంపీఓ లలిత, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఉపేందర్, జిలకరకుంటతండా సర్పంచ్ పకీ నాయక్‌లతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత


గ్రంథాలయ చైర్మన్ కు పుస్తకాలు అందజేస్తున్న శ్రీరాములు

దేవరకొండ : పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు శ్రీరాములు రూ.10వేలు విలువగల 100పుస్తకాలను శుక్రవారం చైర్మన్ పొట్ట చెన్నయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ విద్యార్థులు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రంథలయాలు విద్యాపరంగా ఎంతో తోడ్పాటును అందిస్తాయని ఆయన పేర్కొన్నారు. బావితరాలకు ఉపయోగపడే గ్రంథాలయానికి మేధావులు, విద్యావంతులు ముందుకు వచ్చి తోడ్పాటు అందించాలని ఆయన కోరారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

కొండమల్లేపల్లి : ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి వ్యక్తికి గాయాలైన ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. డిండి మండల కేంద్రానికి చెందిన పి.సైదులు దేవరకొండలో నివాసం ఉంటూ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా శుక్రవారం తనకు సెలవు కావడంతో కొండమల్లేపల్లి మండల కేంద్రానికి వచ్చాడు. ఈ క్రమంలోనే ఒక చెట్టుకు ఒక పార్టీకి చెందిన ఫ్లెక్సీ కట్టేందుకు సాయంగా చెట్టు ఎక్కాడు. అయితే చెట్టుపైన ఉన్న విద్యుత్ తీగలు ఉండడాన్ని గమనించి భయాందోళనకు గరయ్యాడు. దీంతో ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడ్డాడు. కిందపడిన సైదులకు కంటిలోకి కర్రె కుచ్చుకోవడంతో పాటు తీవ్ర గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం

- 300లీటర్ల బెల్లం పానకం ధ్వంసం


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

దేవరకొండ: దేవరకొండ మండల పరిధిలోని పద్మటితండా, మేగ్యతండా, తాటికోల్ గ్రామాల్లో శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్, దేవరకొండ ఎక్సైజ్, సివిల్ పోలీసులు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 300లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.అనంతరం ఆయా గ్రామాల్లో నాటుసారా వల్ల కలిగే అనర్థాలను గ్రామస్తులు,యువతకు వివరించారు. ఈ దాడుల్లో ఎస్ఐలు సూర్యప్రకాష్ ,శ్రీధర్‌బాబు, సిబ్బంది తదితరులున్నారు.